రాజ్యం వారి
శకుంతల
నిర్మాతలు:
శ్రీధరరావు. రాజ్యం..
దర్శకత్వం:
కె. కామేశ్వరరావు B..
రాజశ్రీ రిలీజ్.

—* తారాగణం *—

దుష్యంతుడు	—	యన్. టి. రామారావు
శకుంతల	—	బి. సరోజాదేవి
కణ్వమహర్షి	—	పద్మశ్రీ చిత్తూరు వి. నాగయ్య
మాధవ్య	—	పద్మనాభం
అనసూయ	—	గీతాంజలి
ప్రియంవద	—	శారద
ఆర్యగౌతమి	—	నిర్మల
మారీచమహర్షి	—	డి. రామరాజు
సానుమతి	—	సుమిత్ర
భరతుడు	—	బేబీ పద్మిని
సారంగరవ	—	వేమూరి రామయ్య
శరద్వత	—	గోపాలరాజు
మేనక	—	ఇ. వి. సరోజ
విశ్వామిత్రుడు	—	ముక్కామల
మాధవి	—	లొల్లా సూర్యనారాయణ
రాజమాత	—	పుష్పవల్లి
బెస్తవాండ్రు	—	రేలంగి & రమణారెడ్డి
సైన్యాధిపతి	—	సుకుమార్
మంత్రి	—	క్రిష్ణమూర్తి
దూర్వాస	—	కీ॥ శే॥ కె. వి. యస్. శర్మ

★ శకుంతల ★

—* కధ *—

''కావ్యేషు నాటకం రమ్యం
నాటకేషు శకున్తలా.''

శ్రవ్య-దృశ్య కావ్యాలలో దృశ్యకావ్యమైన నాటకం రమ్యమైనదనీ, ఆనాటకాలలో మహాకవి కాళిదాసు రచించిన-అభిజ్ఞానశాకున్తలం రమ్యాతి రమ్యమైనదనీ-రసికవతంసుల అభిప్రాయం..

ఆ మహాకవి వ్రాసిన మూడు నాటకాలలో ఇది మేలుబంతి. సరససన్ని వేశకల్పనలో, సంభాషణాచాతుర్యంలో, పాత్ర చిత్రణలో, రసపోషణలో, భావమాధుర్యంలో, నాటకీయ శిల్పంలో, ఔచిత్య విచక్షణలో అందలి అత్యున్నతమైన నాటకం వేరొకటిలేదన్నది నిర్వివాదం...

ప్రాచ్య-పాశ్చాత్యభాషలలోకే కాక-ప్రపంచంలో ఇంచుమించు లిపి ఉన్నభాషలన్నిటిలోకీ-అనువదించబడినదంటే దానిప్రాశస్త్యం వేరే చెప్ప నక్కరలేదు..వివిధ భాషల్లోనూ ఈ శాకున్తలకు వేయికిపైగా అనువాదా లున్నాయి—ప్రపంచంలో ఇంత బహుళ ప్రచారంగల భారతీయ రచన మరొకటి లేనేలేదు.

జర్మన్ మహాకవి-నాటకకర్త అయిన 'గాధే [Goethe]' ఈ నాట కాన్ని చదివి-ఆనంద పారవశ్యంతో నృత్యంచేశాడని ప్రతీతి-ఈ అపూర్వ నాటకానికి-సరసమైన చలనచిత్రరూపకల్పన ఈ **'శకుంతల'**

అపర సృష్టికర్తయైన విశ్వామిత్రునికి తపోభంగం కలిగించ టానికై వచ్చిన అప్సరాంగన మేనక-తన నృత్యగాన విలాసాదులతో-ఆమహర్షి సత్తముని వివశుణ్ణి చేస్తుంది-ఆయిరువురికి జనించిన సంతానం శకుంతల-తలిదండ్రులిద్దరూ అరణ్యంలో వదలివెళ్ళిన ఆశిశువును పక్షులే సంరక్షిస్తుం టాయి. పరమతపస్వి అయిన కణ్వమహర్షి-పవిత్ర నదీజలాల అనుష్ఠానా దులు నిర్వర్తించుకుని ఆశ్రమానికి తిరిగివస్తూ ఆశిశువును చూస్తాడు-అపరి మిత వాత్సల్యంతో ఆశిశువును చేరదీసి, పుత్రికాభావంతో పెంచి పెద్దదానిని చేస్తాడు.

హస్తినాపురాధీశుడైన దుష్యంత మహారాజు - ఒకనాడు వేటకు బయలుదేరి, ఆశ్రమ హరిణాన్ని తరుముకుంటూ-కణ్వునిఆశ్రమ పరిసరా లకు వస్తాడు-కణ్వమహర్షి ఆశ్రమంలో లేని సమయమది-అక్కడ తన

చెలులైన అనసూయా ప్రియంవదలతో ఆశ్రమపాదపాలకు నీరు పోస్తున్న సంపూర్ణ యౌవనవతిని శకుంతలను చూసి, ఆకర్షితుడౌతాడు. ఆమె ఆజన్మ బ్రహ్మచారిఅయిన కణ్వుని ఔరసపుత్రిక కాదని తెలుసుకుంటాడు.

శకుంతలా దుష్యంతులు ప్రథమసందర్శనంతోనే పరస్పరానురాగబద్ధు లౌతారు. ఆశ్రమవాసుల కోరికపై దుష్యంతుడా ఆశ్రమంలో కొలది దినాలు ఉండిపోవలసి వస్తుంది. వారి అనురాగం రానురాను మరింత బల పడుతూంటుంది-తుదకు దుష్యంతుడామెను గాంధర్వవిధిని పరిణయమాడ తాడు-శకుంతలా దుష్యంతులు శృంగారరస వాహినిలో తేలియాడుతూ ఉంటారు—

ఇంతలో దుష్యంతుని మాతృశ్రీ అతడిని వెంటనే రాజధానికి తిరిగి రమ్మని అతడు దగ్గర లేనిదే తన వ్రతపరిసమాప్తి జరగదనీ మంత్రిచేత వార్త పంపుతుంది. దుష్యంతుడు నగరికి బయలుదేరటం అనివార్య మవు తుంది- శకుంతల అతడి వెంట బయలుదేరటానికి సంసిద్ధురాలవుతుంది. కాని మహారాజు ఆమెను సమస్త రాజలాంఛనాలతో పట్టమహిషిగా తన నగరికి తీసుకువెడతానని-అంతవరకు ఆమెను ఓర్పు వహించమని-నచ్చ చెప్పి, అభిజ్ఞానంగా తన అంగుళీయకాన్ని ఆమెకుప్రసాదిస్తాడు. ఆమె ఆ ఉంగరాన్ని చూసుకుంటూ-అతడిరూపునే ధ్యానించుకుంటూంటుంది.

ఇంతలో హఠాత్తుగా దూర్వాసమహర్షి ఒకనాడు ఆశ్రమానికివస్తాడు. అనుక్షణం దుష్యంతునే ధ్యానించుకుంటూన్న శకుంతల అతడిరాకను గమ నించలేకపోయింది-ఆమెతనకు అతిథిమర్యాదలు చేయసందుకు దూర్వాసు డాగ్రహావేశుడై -ఆమెతదేకధ్యానంతో తలచుకుంటున్న పతి ఆమెను విస్మ రించునట్లు శపిస్తాడు. ఆ శాపానికి అనసూయా ప్రియంవదలు ఆందోళి తులై -అతడిని తమ చెలితరపున క్షమాభిక్ష వేడుకుంటారు- దుర్వాసుడు ఒకింత శాంతుడై -దుష్యంతుడు శకుంతలకు ఆనవాలుగా యిచ్చిన ఉంగ రాన్ని అతడికి చూపిస్తే-అతడికి మళ్ళీ శకుంతల స్మృతికి వచ్చునట్లు - శాపవిమోచనకు అనుగ్రహించి వెళ్ళిపోతాడు—

శకుంతలకు ప్రియవియోగం దుస్సహ మవుతూంటుంది- అనసూయా ప్రియంవదలు-శకుంతల గర్భవతిఅయినట్లు పసికట్టి పరిహాసా లాడటం మొదలుపెడతారు- ఇంతలో కణ్వమహర్షి ఆశ్రమానికి తిరిగి వస్తున్నట్లు తెలుస్తుంది— శకుంతల లజ్జాభయ సంకోచాలతో కణ్వునియెదుటికి రాలేక పోతుంది-కణ్వుడే ఆమెచెంతకువచ్చి, జరిగినదంతా దివ్యదృష్టినిగ్రహించి ఆమె అనురూపుడయిన వరుని చేపట్టినందుకు ఆనందిస్తాడు-ఆమె ఆసన్న

ప్రసవయని తెలుసుకుని వెంటనే ఆమెను భర్తదగ్గరకు పంపటానికి అవసరమైన సన్నాహాలు చేస్తాడు-శిష్యులైన శారరవ-శారద్వతులను, ఆర్యగౌతమిని శకుంతలకుతోడుయిచ్చి పంపటానికి నిశ్చయించుకుంటాడు-

ఆమహర్షిసత్తముడు వస్తుతః ఎంత నిర్లిప్తుడయినా పుత్రికను అత్తవారింటికి పంపవలసి వచ్చేసరికి - పెంచిన మమకారాన్ని త్రెంచుకోలేక సామాన్యగృహస్థులా విచలితుడై పోతాడు-శకుంతల ఆశ్రమాన్ని వదలి వెళ్ళిపోతూంటే-పెంపుడులేళ్ళు, పెంచిన లతలుసైతం ఆమె యెడబాటును సహించలేక విలవిలలాడిపోతాయి. శకుంతల ఒకవైపు విచారంతో, ఒకవైపు ఆనందంతో-భర్తదగ్గరకు ప్రయాణమవుతుంది. ఆ ప్రయాణంలో ఒకచోట నదినిదాటుతూ-దురదృష్టవశాత్తూ-దుష్యంతుడానవాలుగా యిచ్చిన ఉంగరాన్ని ఆ నదిలో జారవిడుచుకుంటుంది—

వృద్ధగౌతమి, శార్ఙరవ, శారద్వతులు వెంటరాగా ఆమె దుష్యంతుని ఆస్థానానికి చేరుకుంటుంది—కాని దూర్వాసుని శాప ప్రభావంవలన దుష్యంతుడామెను గుర్తించలేకపోతాడు- ఆమెను వివాహమాడిన సంగతే విస్మరిస్తాడు- ఆమెని తిరస్కరిస్తాడు-శకుంతల ఎంతో ఆశాభంగం చెంది, అంగుళీయాన్ని చూసిఅయినా తనని గుర్తించకపోడన్న ధైర్యంతో-చూపబోతుంది-అది అంతకు ముందే జారవిడుచుకున్న సంగతి గమనించదు-ఆ ఉంగరం పోవటంతో-ఆమె క్రుంగిపోతుంది-తిరిగి తన తండ్రి దగ్గరకే వెళ్ళటానికి ప్రయత్నిస్తుంది-కాని శారరవశారద్వతులు స్త్రీకి పుట్టింట గౌరవంకంటె, భర్తయింట దాస్యం మేలని-ఆమెనే అక్కడే పడి ఉండమని ఆదేశించి వెళ్ళిపోతారు.

దుష్యంతుడు పురోహితుని సూచనమీద శకుంతలను ప్రసవించే వరకు తన అంతఃపురంలో ఉండేందుకు అనుమతిస్తాడు-కాని అభిమానవతియైన శకుంతల, అందుకు అంగీకరించలేక అక్కడినుండి వెడలిపోతుంది -శాపవంచితయై-అరణ్యాలబట్టి తిరుగుతున్నశకుంతలను మరీచిమహామునిచూసి, ఆమెని తన ఆశ్రమానికి చేరుస్తాడు—శకుంతల నదిలో జారవిడుచుకున్న ఉంగరాన్ని ఒక చేప మ్రింగుతుంది. మత్స్యజీవులైన యిద్దరుబెస్తలకు ఆ చేపచిక్కుతుంది-వారు వివాదపడి దాన్ని సగానికి కోయగా ఉంగరం బయటపడుతుంది-ఉంగరాన్నిఒకవర్తకునికిఅమ్మజూపగా-రాజుదనితెలుసుకొని రాజభటులకు అప్పజెప్తాడు. దుష్యంతుడు ఉంగరాన్ని చూడగానే శకుంతల స్మృతికి వస్తుంది—కాని ఆమెను కల్సుకోవడం ఎలా?

తెరపై చూడండి—*—*—*—

శకుంతల

★ పాటలు ★

—*—

1. మేనక నృత్యగీతము

రచన : సముద్రాల పాడినది : సుశీల

పల్లవి : కనరా మునిశేఖరా
నినుకోరి దరిజేరినానురా।

చరణం : ఈ హఠయోగాలు నీకింకేలా?
ఈ జపములతో పనియేలా
నీ తపసూ ఫలించును స్వామీ
నా బిగి కౌగిళ్ళలోనా ॥కనరా మునిశేఖరా॥
నందన వనిలో సౌందర్యాలు
పారిజాత సుమపరిమళాలు
దివ్యసుధారస మధురిమ నేనే
అందుకోర-మరులుమీర-మనసుదీర
ఒకేసారి-ఒక్కసారి ॥కనరా మునిశేఖరా॥

, దుష్యంతుడు : పాడినది: ఘంటసాల

సదాశివ శిరోరత్నం శ్వేతవర్ణం నిశాకరం
ధ్యాయే దమృత సంభూతం సర్వకామ ఫలప్రదం।

3. శకుంతల పాట

రచన : ఆరుద్ర పాడినది : సుశీల అండ్ కోరస్

కోరస్ : మధుర మధుర సుమసీమ
సుధలు కురియు వనసీమ ।

శకుంతల: ఏవేవో భావాలు పూపుల
వోలె పూచే సీమ ॥మధుర॥

శకుంతల: తేటికి పాట నెమలికి ఆట
తెలిపే అందాలు।

కోరస్ : ఉసి గొలిపే చందాలు ।

శకుంతల: హంసకు నడక లేడికి పరుగు
నేర్పే పరువాలు

కోరస్ : హాయ్, హాయ్ నీ నిగనిగ చెలువాలు

శకుంతల :కన్నియ చిరునవ్వూ, కమ్మనియగుసిగ్గూ
ఎన్నటికైనా వాడని సీమ ॥మధుర॥

శకుంతల: చల్లని మాసం పెళ్ళిముహూర్తం
మల్లిక వధువుసుమా ।

కోరస్ : ఎలమావే వరుడుసుమా ।

శకుంతల: మంజుల గానం మంగళ గీతం
మన్మథ వేదాలు

కోరస్ : తొలివలపుల మంత్రాలు ।
శకుంతల: పువ్వుల కల్యాణం_నవ్వుల వైభోగం
ముచ్చటలన్నీ తీరే సీమ ॥మధుర॥

4. దుష్యంతుడు

మూలం : కాళిదాసు పాడినది : ఘంటసాల

శ్లోకం॥ అనాఘ్రాతం పుష్పం కిసలయమలూనం కరరుహైః ।
అనావిద్ధం రత్నం మధునవమనాస్వాదిత రసమ్ ।
అఖండం పుణ్యానాం ఫలమివచ తద్రూప మనఘం ।
న జానే, భోక్తారం, కమిహ సముపస్థాస్యతి విధిః॥

5. దుష్యంతుడు

రచన : డా॥ సి. నారాయణరెడ్డి పాడినది : ఘంటసాల

పల్లవి : మదిలో మౌనముగా కదలే మధుర వీణ ।
చరణం॥ రాజహంస వోలె సాగి రమణి తిరిగి చూసె ।
మరుడేమొ దాగి దాగి విరితూపులు దూసె ।
ఈ విరాళి నాలో ఏనాటికి తీరునో॥
వెలివెన్నెల జాలువారె చెలియ నవ్వులోన ।
కనరాని జ్వాలలేవో కలిగెను నాలోన ।
ఈ తీయని రేయి ఇటులే తెలవారునో॥

6. శకుంతల

రచన : సముద్రాల పాడినది : సుశీల

నిర్దయా! నీ మనంబేమొ నేనెరుంగ.
కాని, నినుగోరు నాదు అంగములనెల్ల
రేయి బవలును తపియింపజేయు మరుడు
నీ దయామృతమొలికించి ఆదుకొనుమా ।

7. దుష్యంతుడు

రచన : సముద్రాల పాడినది : ఘంటసాల

చెలియ! నీ మేను తపియింపజేయుగాని,
పంచబాణుడు నను దహియించుచుండె
చిగురుటమ్మల మంటలు రగులజేసి ।
నీ వలపువాన ముంచి మన్నించగదవే॥

8. దుష్యంతుడు

రచన: పాడినది :

కీ॥ శే॥ కందుకూరి వీరేశలింగంపంతులు ఘంటసాల

చల్లనివై శ్రమం బుడుపజాలిన తామరపాకు వీవనల్
మెల్లనగొంచు వీచుదునో మిక్కిలి శీతలమైన వాయువున్

సల్లలితారుణాబ్జ సదృశంబగు నీ చరణద్వయంబు నో
పల్లవపాణి। నా తొడలపై నిడి హాయిగా బట్టువాడనో.

9. దు ష్యం తు డు

రచన : సముద్రాల పాడినది : ఘంటసాల

తరతమ భేదంబు తలపక ధర్మ
ముద్ఘాటించు పంచభూతములు సాక్షి।
శుక పిక శారికాస్తోమంబు కొలువగా
దీపించు ఈ వనదేవి సాక్షి।
శివుని జటాజూట సీమను వెలుగొందు
చంద్రుండు మా కులస్వామి సాక్షి।
అసమాన బ్రహ్మవిద్యానిధి కాశ్యప
మౌనీంద్రు పాదపద్మముల సాక్షి।
గాగ, గాంధర్వ విధి నీదు కరము గొందు
కోమలీ। నాకు నీవల్ల కొడుకు గలుగు
భాగ్య మబ్బిన, నాదు సాంమ్రాజ్యమునకు
వాని యువరాజుగా జేయువాడ। వినుమా।

10. శకుంతల మరియు దుష్యంతుడు

రచన: డా॥ సి. నారాయణరెడ్డి పాడినది:సుశీల-ఘంటసాల

పల్లవి:
దుష్యంత: నీవూ నేనూ కలసిన నాడే నింగీ నేలా కలిసెనులే।
శకుంతల: నీవే నేనై నిలచిన నాడే జీవన రాగం తెలిసెనులే।
చరణం:
దుష్యంత: అలలై పిలిచే నీ అందాలే వలపు తేనియలు చిలికెను నాలో-
శకుంతల : నీలో సాగే అనురాగాలే వేణువు లూదెను నాలో_లోలో॥
శకుంతల: నీలో విరిసే దరహాసాలే పాలవెల్లువై పొంగెను నాలో_
దుష్యంత: జగమును దాటీ, గగనము మీటి ఎగిసెను ఊహలు_నాలో_లోలో।

11. శకుంతల మరియు దుష్యంతుడు

రచన : దాశరధి పాడినది : సుశీల-ఘంటసాల

దుష్యంత: సరసన నీవుంటే జాబిలి నాకేలా
శకుంతల: మనసున నీవుంటే స్వర్గము నాకేలా
శకుంతల: నీ కనుసన్నలలో నిగనిగ చూసి నివ్వెర పోయెను తారకలు
దుష్యంత: తారలలోని తరుణిమ నీవై నన్నే మురిపింతువే_అదే హాయి॥
దుష్యంత: చక్కని నీ ముఖచంద్రుని చూడగ జాబిలి అదిగో_ఆగెనులే
శకుంతల: కౌగిలిలోనా ఊగినవేళా కాలమే ఆగిందిలే_అదేహాయి॥

12. సీమంతము పాట - అనసూయ మరియు ప్రియంవదలు

రచన : సముద్రాల పాడినది : లీల-వైదేహి

చెలులారా శకుంతలా సీమంతము సేయరే।
సుదతులారా చూలాలికి మీ దీవెన లీయరే॥

అరవిరులా కురుల ముడిచి కరముల గాజులు తొడిగి
చలిమిడిని ఒడినించీ- కడుపు చలువ సేయరే॥
వనదేవత పంపించిన వలువలు కట్టించి
జలదేవత పంపిన మణి హారాలను వేయించి-సింగారించి॥

13. కణ్వుడు

రచన మూలం ! కాళిదాసు　　పాడినది : ఘంటసాల

యాస్యత్యద్య శకుంతలేతి హృదయం సంస్పృష్ట ముత్కంఠయా,
కంఠ స్తంభిత బాష్పవృత్తి కలుషం, చింతాజడం, దర్శనం।
వైక్లబ్యం మమ తావదీదృశ మహో స్నేహాదరణ్యౌకసః
పీడ్యన్తే గృహిణః కథంను తనయా విశ్లేష దుఃఖైర్నవైః॥

14. కణ్వుడు

రచన : సముద్రాల　　పాడినది : ఘంటసాల　కోరస్

కణ్వుడు: గురుజనముల వినయముతో కొలువుమా।
సిరిగని పొంగకుమా-పరిజనులను కరుణతో కనుమా
పతి అలిగిన నీ వలుగకుమా-ప్రియభాషిణివై పరిచర్య సేయుమా।
ఈ గతిని చరించిన సతియే- పతివ్రతయౌనమ్మా॥
కోరస్ : ఆనందమౌనమ్మా-అపరంజిబొమ్మా। అత్తవారింటికి పోయిరావమ్మా।
కణ్వుడు: మీ కన్నులలో వెన్నెలయై మీ తెన్నుల పెరిగినదీ।
ముందు మీకే నీరుపోసి-పిదప తాను త్రాగినదీ।
మీ సొగసే తన సొగసుకన్న మిన్నగా తలచినదీ।
మనల విడిచి మగనింటికి కదలేను శకుంతలా।
మనసార దీవించరమ్మా లతలారా! వనదేవతలారా.
కోరస్ : ఆనందమౌనమ్మా-అపరంజిబొమ్మా। అత్తవారింటికి పోయిరావమ్మా।
కణ్వుడు: తల్లిలేని పసికూనను చేరదీసి పెంచితివి
నీ చెలిమిని మరువలేక నిన్నువదలి మనలేక
ఈ హరిణము నిను చూచేను జాలిగా-కన్నీటి జాలుగా　॥ఆనందమౌనమ్మా॥

15. కణ్వ సందేశం

రచన : సముద్రాల　　పాడినది : ఘంటసాల

నమ్మి నీ మాట తన మనసమ్మ కొనియె పెద్దల అనుజ్ఞ పొందకే ముద్దరాలు
సాధువుల మేము-ధర్మ రక్షకుడ వీవు అర్హరీతిని పాలించు మంటిమనుమా!

16. పల్లెవాడు

రచన ; కొసరాజు　　పాడినది : ఘంటసాల

పల్లవి : సెంగాయి కట్టిన చిన్నదీ శారదేసి కళ్ళు వున్నదీ
మనసులోన అది ఏమో ఏమో అణిచిపెట్టుకొంటున్నదీ
సగము సిగ్గుతో వున్నదీ సొగసు దాచుకుంటున్నదీ
ఆపలేని బిల్ తాపముతోటి అంగలారుస్తూ ఉన్నదీ॥
సముదరయ్యతో సేతులు గల్పను శంగనాలు తీయు గంగమ్మలాగా
దూరానవున్న మొగుడు కోసము ఆరాట పడుతూ వున్నదీ।
ఏరు పోటుమీద వున్నదీ గాలిపాటు బాగ వున్నదీ
ఒడ్డుకు జేరే దెప్పుడెప్పుడని ఉరకలు వేస్తూ వున్నదీ॥

17. నేపథ్య గానము

రచన : శ్రీ శ్రీ   పాడినది : పి. లీల

పల్లవి : అమ్మా శకుంతలా_ఎందుకే శోకము
వొందుమా ధైర్యము_నిను బ్రోచులే దైవము।
కష్టము తీరగ సౌఖ్యము రాదా
చీకటి వెంబడి వెలుగు లేదా
వీరవనితవై వీరజననివై
వెలిగే రోజులు రావా_నీ
వెతలే మాయము కావా॥
నీకిది నేడొక అగ్నిపరీక్ష।
నేరము నేయని వారికి శిక్ష।
వేదనలైనా శోధనలైనా
విడనాడకు నీ దీక్ష_ఇక
అదియే నీకౌ రక్ష॥
ఉత్తమ శీలవు నీవే
ఉజ్జ్వల కాంతివి నీవే
సత్యము ధర్మము నీవే।
సాధ్వీమణివి నీవే।
నిజమును చాటించుమా
విజయము సాధించుమా॥

18. బెస్తవాండ్లు

రచన: కొసరాజు

పాడినది : మాధవపెద్ది, పిఠాపురం నాగేశ్వరరావు, రాఘవులు

పల్లవి: పాతాకాలంనాటి బెమ్మదేవుడా
మా జాతకాలు రాశావా బెమ్మదేవుడా
పచ్చ, పాతంగ గీశావా బెమ్మదేవుడా॥

చ॥ 1. కోటలోన కులకమని అశ్శరు రాసి।
యేటిమీన బతకమని యీశ్శరుగీసి।
పైన వుండి సూశే ఓ బెమ్మదేవుడా।
బలే మంచి తాతవయ్యా బెమ్మదేవుడా॥

2. గంజిలోని కుప్పుగల్లు కరువో కరువూ।
కట్టుకోను పాతగుడ్డ కరువో కరువూ
గాలానికి శేపపిల్ల కరువో కరువూ
మతిమళ్ళిన వీదంతా ఒకటే దరువూ।

3. ఏపూట కాపూట గండాలయ్యా।
గుప్పెట్లో పాణాలు వుండాలయ్యా।
ఆకలైన లేకుండ శెయ్యరాదా।
అన్నమైన నోటికి అందియ్యరాదా।

4. బొచ్చెపిల్ల పడకుంటె బువ్వేలేదయ్యో।
కొఱ్ఱమీను శిక్కకుంటె కూరేలేదయ్యో।
ఉత్తశేతుల పోతే పస్తేనయ్యో।
ఒక్క వాలగమ్మ నిస్తే మొక్కేమయ్యో॥

19. శకుంతల

రచన : దాశరధి　　　　　　　　　　　　　　　　　　　　　　పాడినది : సుశీల

పల్లవి: నా కంటి పాపవైనా
నా ఇంటి దీపమైనా
నీవే _సుకుమారా
రారా_ఓ వీరా!

చ॥ నెలరాజులోని సొగసు
దినరాజులోని వెలుగు
నీయందు నిండి
నా కలలు పండి
యువరాజు వౌదులేరా
రారా_సుకుమారా
ఓహో_వీరా!

హరిచేత సిరులు పొంది
హరుచేత వరములంది
లోకాల నేలి
భోగాల తేలి
చిరకీర్తి నందుకోరా!
రారా_సుకుమారా
ఓహో_వీరా!

ఇంటింట శాంతి నిలిపి
జగమంత కాంతి నింపి
సురవరుల నరుల
జేజేల నంది
వర్ధిల్లు భరతవీరా!
రారా_సుకుమారా
ఓహో_వీరా॥

20. శకుంతల

రచన : సముద్రాల　　　　　　　　　　　　　　　　　　　　　　పాడినది : సుశీల

పల్లవి: అమ్మా_శరణమ్మా!
ఇకనైన కరుణ గనవమ్మా_ఓ
చరణము: ఎల్లజీవులను చల్లగ నేలే
తల్లివి నీకీ భేదములేలా!
ఎడబాటులతో యిటు వేగుటకు
మా అపరాధము లేమమ్మా!
సామి మేనిలో సగము పంచుకొని
వంతనిలే_ఓ జగదంబా!
మమతలు నీవలె మాకును లేవా
మనసులు తీరుప రావమ్మా॥

సాంకేతిక నిపుణులు

నిర్మాతలు :	శ్రీధరరావు & రాజ్యం
దర్శకత్వం :	కమలాకర కామేశ్వరరావు, బి. ఏ..
ఛాయాగ్రహణం :	ఎం. ఎ. రహమాన్
కళ :	టి. వి. ఎస్. శర్మ
సంగీతం :	ఘంటసాల
మాటలు :	సముద్రాల
పాటలు-పద్యాలు :	సముద్రాల, శ్రీ శ్రీ, దాశరధి, ఆరుద్ర & కొసరాజు
కూర్పు :	ఎస్. పి. ఎస్. వీరప్ప
నృత్యం :	హిరాలాల్ & వెంపటి సత్యం
కాస్ట్యూమ్స్ :	కీ. శే. అచ్యుతరావు & కె. ఎ. రహిమాన్
మేకప్ :	పీతాంబరం & రామదాస్
స్టూడియోలు :	శారదా (లెస్సీస్ M/s. A. L. S. ప్రొడక్షన్స్) & వాహిని
సహకారదర్శకులు :	గురుదేవ్
సహకార కళాదర్శకులు :	సోమనాధ్
ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ :	పి. టి. ఎస్. ప్రసాద్
ప్రొడక్షన్ మేనేజరు :	పి. సుబ్బారావు & ఎస్. ప్రసాద్
నేపథ్యగాయకులు :	ఘంటసాల, సుశీల, మాధవపెద్ది, పిఠాపురం నాగేశ్వరరావు, పి. లీల, వైదేహి & రాఘవులు.